విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 27, అక్టోబరు 2025

మొక్కజొన్న క్వింటాకు రూ.2500ల గిట్టుబాటు ధర కల్పించాలి

జిల్లా రైతు సంఘం డిమాండ్..

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: జిల్లావ్యాప్తంగా మొక్కజొన్న పంట పంట కాలం పూర్తయి కోతలు జరుగు తున్న సమయంలో గిట్టుబాటు ధర పతనం కావడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నదని, రైతులను ఆదుకొనే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చెన్నప్ప యాదవ్, చిరుతల మల్లికార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో పంట మార్పిడి చేయాలని ప్రభుత్వ అధికారులు చెప్పిన మేరకు రైతులు మొక్కజొన్న పంటవైపు అడుగులు వేశారని.. ఎకరాకు పెట్టుబడి దాదాపు రూ.30 వేలు సాగు ఖర్చు చేశారన్నారు. నెల కిందట వరకు మొక్కజొన్న క్వింటాళ్ల ధర రూ. 2300 వరకు వుండేదని తీరా పంట దిగుబడి పెరిగి కోత సమయంలో ప్రస్తుతం ధర రూ.1700కు పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. అమాంతం ధర పతనం అయితే రైతాంగం అధోగతి పాలవుతుందని రైతులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.

ఆధార్ కోసం అష్టకష్టాలు..

36 గ్రామాలకు గాను యాటకల సచివాలయంలో మాత్రమే సేవలు
రెండేళ్ల నుంచి ఒకే ఆధార్ సెంటర్..!

విశాలాంధ్ర–శెట్టూరు: ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం మండలంలోని ప్రజలు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు గతంలో తీసుకున్న ఆధార్ కార్డుల్లో తప్పులు నమోదు అయ్యాయి. వాటిలో వివరాలు సరి చేయించేందుకు రెండు ఆరు నెలలుగా ఆధార్ కార్డు నమోదు, ఈకే వైసి, బయోమెట్రిక్, మొబైల్ నెంబర్లింక్, ఆధార్‌లో మార్పులు చేర్పులు కోసం నానా తిప్పలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకానికి ఆధార్ కార్డు లింక్ తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో పిల్లలు, గర్భినులు, వృద్ధులు రోజులు వ్యవధి సచివాయాలు, ఆధార్ సేవా కేంద్రాలు చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ సేవలకు శెట్టూరు మండలంలోని 13 సచివాలయాలు ఉన్నాయి. గతంలో 3 ఆధార్ సెంటర్లు ఉన్నాయి. శెట్టూరు, తిప్పనపల్లి, యాటకల్లు సచివాలయం పరిధిలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ ద్వారా మిగితా గ్రామ సచివాలయం వారంలో ఒకటి రెండు రోజులు చొప్పన ఆధార్ సేవాలను అందించే వారు, కానీ రెండు సంవత్సరాల నుంచి తిప్పనపల్లి సచివాలయంలో సేవలు ఉన్నప్పటికీ పని చేయదానికి డిజిటల్ అసిస్టెంట్ ముందుకు రావడం లేదు. శెట్టూరు సచివాలయాలల్లో ఉన్న ఆధార్ మిషన్ మరమ్మతులకు గురైంది. దీంతో యాటకలు సచివాలయంలో పనిచేసే మిషన్లతో ఆధార్ సేవాలకు కొనసాగిస్తున్నారు దీంతో మండల వ్యాప్తంగా 36 గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు వందల సంఖ్యలో ఆధార్ కార్డు నమోదు, ఆధార్ కార్డు సవరణలు, పిల్లల ఆధార్లకు ఈజేవైసీ, మొబైల్ నెంబర్ మార్పులకు తదితర ఆధార్ సేవకు సచివాలయాల చుట్టూ నెలలుగా ప్రదక్షణలు చేస్తున్నారు. ఈ రోజు ఒక ఊరు మరోక రోజు మరోక ఊరు అంటూ తిప్పుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు లబోదిబోమంటున్నారు సచివాలయం వద్ద లబ్ధిదారు నిరీక్షణ తప్పడం లేదు. దానికితోడు డిజిటల్ అసిస్టెంట్ ఇతర పనులు కూడా చేయాల్సి ఉండడంతో ఆధార్ సేవలో అంత రాయం ఏర్పడుతున్నది. డిజిటల్ అసిస్టెంట్లు తీవ్ర పనిభారంతో అనారోగ్యం గురవుతున్నారు.అధికారులు స్పందించి ఆధార్ సెంటర్లను పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యా రంగ సమస్యలపై బస్సుజాత జయప్రదం చేయండి

విశాలాంధ్ర–పెద్దవడుగూరు: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర వ్యాప్త బస్సు జాతను జయప్రదం చేయాలని నియోజకవర్గం కార్యదర్శి నరసింహయాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దవడుగూరు మండలంలో ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 22న ఇచ్ఛాపురంలో బస్సు జాత ప్రారంభం జరుగుతుందన్నారు. నవంబర్ 12న అనంతపురంలో ముగింపు ఉంటుందన్నారు. పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు విడుదల చేయాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పిపిపి విధానాన్ని రద్దు చేయాలని, వంద రోజుల్లో రద్దు చేస్తామన్న 107, 108, 77 జీవోలు రద్దు ఎప్పుడు చేస్తారంటూ మంత్రి నారా లోకేష్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, గురుకుల కేజీబీవీ మోడల్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దుచేసి,ఏ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఆ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష నిర్వహించాలని, విద్యారంగ సమస్యలు అన్నింటినీ పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు జాత జయప్రదం చేయాలని కోరారు. నవంబర్ 12వ తేదీ అనంతపురంలో ముగింపు సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో విద్యారంగానికి ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, చదువుతున్న విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న 6400 కోట్లు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల పిపిపి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల, కేజీబీవీ,మోడల్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించి కేజీబీవీ టీచర్స్‌కు నైట్ డ్యూటీ తగించి నైట్ హాస్టల్ వార్డెన్ కేటాయించాలని, రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ వేశారు. పెద్దవడుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు జిలన్ మోదిన్ ఉపాధ్యక్షులు వినయ్ అరుణ్ మస్తాన్, సహాయ కార్యదర్శులు నితిన్ రాజు, మణికంఠ విక్కి, తదితరులు పాల్గొన్నారు

ఆర్‌ఎంపీలకు డాక్టర్ దేవరాజు దిశానిర్దేశం..

విశాలాంధ్ర–యాడికి : మండలం కేంద్రంలోని రాయలచెరువు పిహెచ్‌సి వైద్యాధికారి దేవరాజు ఆదివారం ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపిలు ఇకనుంచి బోర్డుల మీద డాక్టర్లు అనే పదాన్ని వాడకూడదని, గాయాలకి కుట్లు, డెలివరీ కేసులు చేయరాదని వాటికి తగు మెడిసిన్‌ని వాడకూడదని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని, తెలియని వైద్యాన్ని చేయకూడదని సూచించారు. రాయల చెరువు గ్రామంలో ఉన్న పీఎంపీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఆర్‌ఎంపిలు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత

విశాలాంధ్ర–యాడికి: ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సాగర్ సిమెంట్ కర్మాగార వ్యవస్థాపకులైన సమ్మిడి వీరారెడ్డి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ప్రథమ బహుమతి 20 వేలు, ద్వితీయ 15 వేలు, తృతీయ 10 వేల రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతులను విద్యార్థులకు అందిస్తున్నామని ఆదివారం సాగర్ సిమెంట్ వి.పి.ఈ.సి రంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు వీరారెడ్డి చిన్న కాంట్రాక్టర్ గా జీవితాన్ని ప్రారంభించి వ్యాపారవేత్తగా ఆయన ఉన్నత స్థానంలో నిలిచారన్నారు. అందరూ చదువుకోవాలని ఆశించేవారని, ఆయన ఆశయాలకు ముందుకు తీసుకెళ్తూ ఆయన పేరుమీద సేవా కార్యక్రమాలు సంస్థ యాజమాన్యం చేస్తున్నామని అన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంఆర్‌సి కార్యాలయానికి కర్మాగార యాజమాన్యం ఉచితంగా కంప్యూటరు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజిఎం హెచ్‌ఆర్ ప్రభాకర్ రెడ్డి, మండల విద్యాధికారి ధనలక్ష్మి, జిఎంలు జయరాం రెడ్డి, ప్రసాద్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శభాష్ ఎమ్మెల్యే గారూ..!

రోడ్డుపై పడిపోయిన వృద్ధుడిని ఆసుపత్రికి తరలించిన సురేంద్రబాబు

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: తాను ప్రయాణించే మార్గంలో ఆదివారం అచేతనావస్థలో పడి ఉండటానికి గమనించిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు మానవత్వం చూపించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధున్నీ అక్కున చేర్చుకుని ఆసుపత్రికి తరలించారు. అనంతపురం నుంచి తూర్పు కోడిపల్లి గ్రామంలో జరుగుతున్న మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ కోసం వెళుతుండగా రింగ్ రోడ్డులో నిర్లిప్తంగా పడి ఇబ్బంది పడుతున్న వ్యక్తిని గమనించిన ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి తన సిబ్బంది సాయంతో అతడినిపైకి లేపి మంచినీళ్లు అందించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.. మదనపల్లికి చెందిన సురేష్ అని అనారోగ్యంతో కిందపడి పోయాడని చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాసు పత్రికి వాహనంలో తరలించారు.. దీంతో రోడ్డుపై వెళుతున్న వారు చూసి ఎమ్మెల్యే గొప్ప వ్యక్తి అని శభాష్ ఎమ్మెల్యే గారూ అంటూ కీర్తించారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎస్.హరి ప్రసాద్ యాదవ్

విశాలాంధ్ర–విడపనకల్లు : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్న విడపనకల్లు ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను గుంతకల్ రెవిన్యూ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎస్.హరి ప్రసాద్ యాదవ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి విడపనకల్లు ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం విద్యార్థినులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తల్లిదండ్రుల నుండి నాకు అనేక ఫిర్యాదులు అందాయన్నారు. అలాగే విశాలాంధ్ర పత్రికల్లో వార్తల ఆధారంగా ఆదివారం మధ్యాహ్నం హాస్టల్‌ను సందర్శించేందుకు వెళ్లగా అక్కడ విధుల్లో ఉండాల్సిన వార్డెన్ లేకపోవడంతో గేటు బయట నుండే విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కడుపునిండా అన్నం పెట్టడం లేదని మంచినీళ్లు ఇంటి దగ్గర నుంచి తెచ్చుకోమని వార్డెన్ చెబుతున్నారని, చికెన్ రెండు పీసులు వేస్తున్నారని ప్రశ్నిస్తే నానా బండ బూతులు తిడుతున్నారని టాయిలెట్లు సింక్ బ్లాక్ అయిందని, లైట్స్ కూడా సరిగా వెలగడం లేదని, కరెంట్ పోతే వచ్చేవరకు చీకటిలోనే ఉండాలని, సీసీ కెమెరాలు పని చేయకపోవడం హాస్టలుకు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల రాత్రిపూట భయభయంగా గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. వార్డెన్ పార్ట్ టైం టీచర్ వారి ఇష్టం వచ్చినప్పుడు వచ్చి వెళ్లిపోతారని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. హరి ప్రసాద్ యాదవ్ వార్డెన్‌కి అనేకసార్లు ఫోన్ చేయగా ఒకసారి ఫోన్ ఎత్తి నేను అందుబాటులో లేను మీరు మరోసారి సారి రండి అని పొంతన లేని సమాధానం చెప్పారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్న హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని మీడియా ద్వారా కోరారు.

ఉరగాద్రి బాలోత్సవానికి స్పందన

విశాలాంధ్ర–ఉరవకొండ: నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి 15 అంశాలపై నిర్వహించిన ఆదివారం స్థానిక ఎస్.కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉరగాద్రి బాలోత్సవం 2025 పోటీలకు విశేష స్పందన లభించింది. విశిష్ట అతిథులుగా గవి మఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి, హావలిగి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట మాట్లాడుతూ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవం పురస్కరించుకొని బహుమతులు ప్రశంసా పత్రాలను అందివ్వనున్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన డ్రాయింగ్, స్కిప్పింగ్ రంగోలి విలువలతో కూడిన కథలు హావ భావాలతో చెప్పే పోటీలకు దాదాపు 500 మంది జూనియర్ విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. నవంబర్ 2, 8 9 తేదీలలో కూడా వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథులు కర్రీ బసవ రాజేంద్రస్వామి మాట్లాడుతూ నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నైతిక విలువలు ఆరోగ్యం ఉన్నత చదువులు అనేక అంశాలపై అవగాహన కల్పించేందుకు పోటీలను నిర్వహించడం హర్షనీయం అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునీత, శ్రీదేవి, భారతి, నీలిమ, మౌనిక శంకరయ్య, శర్మస్, చంద్రమోహన్ సురేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా.. నార్పల క్రీడామైదానం

విశాలాంధ్ర–నార్పల : మండల కేంద్రంలోని క్రీడా మైదానం మందుబాబులకు అడ్డాగా మారింది. రోజూ సాయంత్రం వేళల్లో మందుబాబులు క్రీడా మైదానానికి వచ్చి మద్యం సేవించి సీసాలు, చెత్తను అక్కడే విడిచి పెట్టి వెళ్లిపోతున్నారు. సోమవారం నుంచి మొదలు అయ్యే మండల స్థాయి స్కూల్ గేమ్స్ లో పలువురు విద్యార్థులు పలు ఆటలు పాల్గొనే అవకాశం ఉండడంతో మందుబాబులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ బాలుర పాఠశాలకు విద్యార్థులు క్రీడలు ఆడుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మద్యం సేవించి సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను మైదానంలో వదిలేసి వెలుతున్నారు. కొందరు ఆకతాయిలు సీసాలను పగుల గొట్టేస్తున్నారు. అంతేకాక గ్రంథాలయం వద్ద ప్రహరీ గోడలు లేకపోవడంతో మందుబాబులు రాత్రి సమయంలో మద్యం తాగుతూ మూత్రవిసర్జన చేస్తున్నారు. ఈ సమస్యను అరికట్టడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన గురుకుల పాఠశాల బాలికలు

విశాలాంధ్ర–ఉరవకొండ: తైక్వాండో పోటీలలో ఉరవకొండ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినీలు పోటీలలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. పాఠశాల ప్రిన్సిపల్ జ్ఞాన ప్రసూన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండ పోటీలలో ఐదుగురు విద్యార్థినీలు గోల్డ్ మెడల్, ఐదుగురు సిల్వర్ మెడల్, ముగ్గురు విద్యార్థినులు బ్రాంజ్ మెడల్స్ సాధించి బహుమతులను పొందారని తెలిపారు. ఆ విద్యార్థినులను, పీఈటీ మీనా వైస్ ప్రిన్సిపాల్ సుమలత, లైబ్రేరియన్ కుళ్ళాయమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ముఖ్య అతిథిగా బొంబాయి రమేష్ నాయుడు

విశాలాంధ్ర–యాడికి : అనంతపురం జగదీశ్‌నగర్‌లో జయ మణెమ్మ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన 15 వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ పూంసాయి తైక్వాండో క్రీడా పోటీలకు ఆదివారం ప్రత్యేక ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు బొంబాయి రమేష్‌నాయుడు హాజరయ్యారు. క్రీడాకారులు ప్రతిభను కనబరచి ఊరికి, రాష్ట్రానికి, దేశానికి, మంచిపేరు తేవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం బొంబాయి రమేష్‌నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్ర మోహన్ అసోసియేషన్ సభ్యులు శాంత రాజు పూలబొకేతో సత్కరించారు. కోచ్‌లకు మెమొంటోలను బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం సాయినాథ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, వైసీపీ నాయకులు చిట్టెం రెడ్డి బాల రెడ్డి, వెంకటనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: రామాయణాన్ని రాసిన మహాకవి, మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపట్టిన నాటి నుంచి ప్రతి గ్రామంలోను జయంతి వేడుకలను జరుపుకుంటున్నారని.. మీ అందరి సమక్షంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే సురేంద్రబాబు అన్నారు. మండలంలోని తూర్పు కోడిపల్లి గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ, జయంతి వేడుకలకు ఆదివారం ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, టీడీపీ సీనియర్ నాయకులు హాజరవ్వగా వారికి వాల్మీకి సోదర, సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరూ కలసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, గ్రామాల్లో ఎక్కడా కూడా విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు మల్లికార్జున గోళ్ళ వెంకటేశులు, వైపీ రమేష్, కోడిపల్లిలో వాల్మీకి జయంతి వేడుకల్లో జిల్లా వాల్మీకి జేఏసీ చైర్మన్ డీఎస్ మూర్తి, వైసీపీ నాయకుడు బోయ తిప్పేస్వామిపాల్గొన్నారు.

2న కార్తీక వన భోజన మహోత్సవం

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమం నవంబర్ 2న రాప్తాడు మండలం హంపాపురం సమీపంలో దోనాదుల నాగ శేషు అండ్ బ్రదర్స్ వ్యవసాయక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు అఖిలభారత కాకతీయ ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు ఆదివారం తెలిపారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పేద కుటుంబానికి సరుకులు పంపిణీ

విశాలాంధ్ర– తాడిపత్రి: పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉన్న శివక్రిష్ణ సాయి వృద్ధా ఆశ్రమంలో నందలపాడుకు చెందిన గంధమ్మ అనే నిరుపేద కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెలకు సరిపోయే నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.సంజీవరెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ సెక్రటరీలు నారాయణస్వామి, లక్ష్మి అనురాధ, నాగవాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర–ఉరవకొండ: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి హక్కుల పోరాట సమితి నాయకులు న్యాయవాది చంద్ర చర్ల హరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వాల్మీకి కళ్యాణమండపంలో బహుజన యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. వాల్మీకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా వాల్మీకులను ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో పునరుద్ధరిస్తామని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఎన్నికలు అయిపోగానే మరిచిపోతున్నారని ఆరోపించారు. కేంద్రం రాష్ట్రంలోనూ వాల్మీకులను ఓటు బ్యాంకు రాజకీయంగా పార్టీలు వాడుకుంటున్నాయని మండిపడ్డారు. జిల్లాలో 14 నియోజకవర్గాలలో కూడా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు సుశీలమ్మ, డి సురేష్, ముండాస్ ఓబులేసు, నారాయణప్ప, సురేంద్ర, హనుమప్ప, దిద్దేకుంట రామాంజనేయులు శ్రీరాములు పాల్గొన్నారు.

ఘనంగా దేవమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవమ్మ దేవి ఆలయంలో సోమ మంగళ వారాల్లో దేవమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన, కలస ప్రతిష్టాపన నిర్వహిస్తున్నట్లు ఆలయ పెద్దలు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం గణపతిపూజ, గణపతి హెూమం, నవగ్రహ హెూమం, దుర్గా హెూమం, మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం హెూమాలు, మంగళవారం ఉదయం గంగపూజ, గోపుర కలస ప్రతిష్టాపన, దేవమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన, మహా మంగళహారతి, హుండిబియ్యం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి భక్తాదులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: మండలం హెూసగుడ్డం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకుని వారి వద్ద నుండి రూ.14,500ల నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. సిబ్బంది నాగరాజు, మల్లికార్జున, రామాంజనేయులు, కృష్ణారెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానానికి వ్యతిరేకంగా నేడు ర్యాలీ..

విశాలాంధ్ర–గుంతకల్లు : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణ ఆపాలని వైసీపీ స్టూడెంట్ లీడర్ రాష్ట్ర నాయకులు వంశీ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైసీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు నక్కా నారప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం వైయస్ఆర్ఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశి యాదవ్, ఏపీఎస్ జిల్లా అధ్యక్షులు వాల్మీకి వంశీ ఎన్ఎస్‌యువై నియోజవర్గ అధ్యక్షులు అక్షయ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిపిపి విధానం ద్వారా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను 66సంవత్సరాల వరకు ప్రైవేటు వారికీ కట్టాబెడుతూ పేద మధ్య తరగతి వారికీ ప్రభుత్వ విద్య అందకుండా అన్యాయం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రైవేటుపరం కాకుండా చేసే ఉద్యమానికి మద్దతుగా నిలవాలన్నారు. నేడు ర్యాలీ ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం దిగి వచ్చేవరకు విద్యార్థి ఉద్యమాలు బలంగా చేయాలని పిలుపునిచ్చారు. 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్ మండల ఉపాధ్యక్షుడు గణేష్ నాయకులు అజయ్ మధు ఎన్ఎస్‌యుఐ నాయకులు రవి, స్రవంత్ పాల్గొన్నారు.

పెన్నోబిలం రిజర్వాయర్ నుండి నీటి విడుదల

డిప్యూటీ ఎడ్యుకేటివ్ ఇంజనీర్ వెంకటరమణ

విశాలాంధ్ర–కూడేరు: పెన్నోబిలం రిజర్వాయర్ నుండి ఆదివారం 5,6వ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలినట్టు డిప్యూటీ ఎడ్యుకేటివ్ ఇంజనీర్ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్ పూర్తి సమర్థం 11.1000 టీఎంసీలు ఉన్నట్లు. లింకు ఛానల్ ద్వారా 150 క్యూసెక్కులు, హంద్రీనీవా ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 550 క్యూసెక్కులు నీరు చేరుతుండగా, కుడి కాల్వ ద్వారా 35 క్యూసెక్కులు, వృధా నీరు 25 క్యూసెక్కులు, విద్యుత్కు 105 క్యూసెక్కులు, త్రాగునీరు ద్వారా మొత్తం 55, క్యూసెక్కులు,స్పీల్ వే కింద 200 క్యూసెక్కులు, మొత్తం కలిపి 420 క్యూసెక్కులు బయటికి వెళ్తుండగా, ఆదివారం 4, 6 గేట్లు ఎత్తి 420 క్యూసెక్కుల నీటిని బయటికి వదిలినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ ముత్యాలప్ప, గంగమ్మ రేణుక తదితరులు పాల్గొన్నారు, లక్ష్మీదేవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

27న మండల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర–గుత్తి : పట్టణంలోని ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో ఈనెల 27,28 తేదీలలో రెండు రోజులపాటు మండల స్థాయి స్కూల్ గేమ్స్ జరుగనున్నాయని శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ కె.ఎచ్. సరోజ, పుష్పరాజు, శ్యామల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 అండర్ 17 బాల బాలికలకు స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు వివరించారు. 27న వాలీబాలు,కోకో,కబడ్డీ ఆటలు, అదే రోజున చెస్, యోగా, షటిల్ పోటీలు, 28వ తేదీన అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా 100 మీటర్లు,200 మీటర్లు,400 మీటర్లు షాట్ పుట్, డిస్కస్, జావలిన్ లాంగ్ రేస్ పరుగు పందెం పోటీలు జరుగుతాయని చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొనివిజయవంతం చేయాలని కోరారు.

ఆటో ద్విచక్ర వాహనం ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు..

విశాలాంధ్ర–యాడికి : మండలంలోని చందన గ్రామానికి చెందిన రమేష్ తన భార్యతో కలిసి యాడికి వెళ్లి తన ద్విచక్ర వాహనంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా రైల్వే గేట్ నుండి వస్తున్న ఆటో ఢీకొనడంతో రమేష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి ఆయన భార్య చేతికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 ద్వారా గుత్తికి తరలించారు.

ఘనంగా జితేంద్ర గౌడ్ జన్మదిన వేడుకలు



విశాలాంధ్ర–గుంతకల్లు : స్థానిక మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ జన్మదిన వేడుకలు కార్యకర్తలు, అభి మానుల మధ్య ఘనంగా జరిగాయి. టీడీపీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, ఈడిగ కుల సంఘం సభ్యులు, రామగౌని అభిమానులు మధ్య కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 27, అక్టోబరు 2025

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెరలకు ప్రాధాన్యం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

విశాలాంధ్ర,గోరంట్ల : పార్టీ, నామినేటెడ్ పదవులతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గీయులకు అధిక ప్రాధాన్యమివ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గోరంట్ల మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంత్రి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలని వడ్డెర కులస్తులు కోరారని సొంత నిధులతో విగ్రహాన్ని అంద చేశానని తెలిపారు. బీసీలకు టీడీపీతో, రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్, నేడు సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. బీసీల మనోభావాలకు గౌరవమిస్తూ, విశ్వకర్మ జయంతి, వాల్మీకి జయంతి, కనకదాస జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనన్నారు. రేనాటి యోధుడు, అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య దాష్టీకాలను ఎదిరించి మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలికిన వడ్డే ఓబన్న జయంతిని కూడా అధికారికంగా నిర్వహించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఈ ఏడాది జనవరి 11న ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీల ఆత్మగౌరవానికి సీఎం చంద్రబాబు ఎప్పుడూ ప్రాధాన్యమిస్తూ ఉంటారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో అత్యధికంగా లబ్ధి పొందేది బీసీలేనన్నారు. పెనుకొండలో కూటమి అభ్యర్థిగా తన విజయంలో వడ్డెర సామాజిక వర్గీయులు కీలక భూమిక పోషించారని కొనియాడారు.

ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లోనూ వడ్డెర నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించామన్నారు. వడ్డెరలకు క్వారీ కేటాయింపుల్లో 15 శాతం రిజర్వేషన్లతో పాటు సీనరేజ్ ఫీజులో 50 శాతం రాయితీ కూడా అందిస్తామన్నారు. వడ్డెరలను ఎస్టీలో చేర్చే అంశం సీఎం చంద్రబాబునాయుడు దృష్టిలో ఉందన్నారు.

ఆ హాస్టల్‌లో సర్కార్ మార్గదర్శకాలు వర్తించవు..!

మెనూలో ఇష్టారాజ్యం అడ్డగోలుగా వ్యవహరిస్తున్న వార్డెన్

విశాలాంధ్ర,కదిరి : పేదరికంతోనూ, కుటుంబ సమస్యలతో పిల్లలు చదువు మానేయకుండా ఉండాలనే సంకల్పంతో కల్పతరువుగా ఏర్పాటుచేసిన సంక్షేమ వసతిగృహాల్లో మెనూ దోపిడీ చేస్తూ అడ్డగోలుగా వ్యవహరిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకునే నాథుడు లేదు. కదిరి వివర్స్ కాలనీలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ఆదివారం ఉదయం అల్పాహారంలో మెనూ ప్రకారం పూరి, కుర్మా ఇవ్వకుండా పూరి, చెట్నీ పెట్టారని కొందరు విశాలాంధ్ర విలేకరికి ఫిర్యాదు చేయగా మధ్యాహ్న భోజన సమయానికి అక్కడికి వెళ్లి చూడగా విద్యార్థి చేత నీళ్లు మోయిస్తున్న దృశ్యం కంటపడింది. వివరణ అడుదామంటే వార్డెన్ అందుబాటులో లేరు. 70 మంది విద్యార్థులకు చాలీచాలని చికెన్, నాసి రకమైన అరటి పండు అందించారు. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్. కోసం వసతి గృహంలో చేర్పిస్తే తమ పిల్లల

చేత ఇలాంటి పనులు చేయించడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తప్పులు చేస్తున్న వార్డెన్లపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పలుమార్లు నాణ్యమైన ఆహారం అందించాలని విద్యార్థి సంఘం నాయకులు ధర్నాలు చేసి అధికారులకు వినతిపత్రాలు అందించినప్పటికీ చర్యలు శూన్యం.

శాఖాపర చర్యలు తప్పవు

విద్యార్థుల చేత పనులు చేయించడం తప్పు అని బాలాజీ (ఏబీసీడబ్ల్యూ) తెలిపారు. ఇలాంటి తప్పులు ఎవ్వరు చేయద్దని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన. చర్యలు తప్పవన్నారు.

తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ, కలెక్టర్, ఆర్డీఓ అధికారుల ఆదేశాల మేరకు రాబోవు మంథా తుఫాను కారణంగా రాబోవు నాలుగు రోజులలో భారీ ఈదురు గాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉన్నందు వలన ధర్మవరం మండల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మార్వో సురేష్ బాబు తెలిపారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయం లోని అధికారులు సిబ్బందితో వారు సమావేశాన్ని ఏర్పాటు చేసి, అనంతరం ప్రజలకు తెలియజేయాల్సిన విషయాలను తెలియజేశారు. మట్టి మిద్దె ఇండ్లలో ఎవరు నివాసం చేయరాదు అని, వర్ష పరిస్థితి తగ్గే వరకు దగ్గర లో వున్న ప్రభుత్వ భవనాలలో ఉండాలని తెలిపారు. అవసరమైన వారు తక్షణమే గ్రామ రెవిన్యూ అధికారి కి సమాచారం అందించాలన్నారు. ఈదురు గాలులకు చెట్లు పడి పోవడం, కరెంటు తీగలు జారి పోవడం జరుగుతుంది కావున చెట్ల క్రింద, కరెంటు స్థంబాల క్రింద ఉండకూడదు అని, గర్భిణీ మహిళల పరిస్థితిని, వారి కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆశ వర్కర్, సంబంధిత ఏఎన్ఎం వారికి తెలియచేయవలెను అని తెలిపారు. ఈదురు గాలి వలన చెట్లు, చెట్ల కొమ్మలు రోడ్డు మీద పడిపోయి రాకపోకలు ఇబ్బంది కల్గినచో తక్షణమే స్థానిక గ్రామ పంచాయతీ వారికి , గ్రామ రెవిన్యూ అధికారికి సమాచారం అందించాలన్నారు. అనారోగ్యంతో వున్న కుటుంబ సభ్యుల పట్ల ముందు జాగ్రత్త తీసుకోవాలన్నారు. చెరువులు, కాలువల దగ్గరకు పోరాదన్నారు. ఎలాంటి అసాధారణ పరిస్థితి వున్నా తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 9553929724, నంబర్లకు సమాచారం అందించితే తక్షణం పరిష్కారం చేస్తామని తెలిపారు.

జిల్లాలో నేరాలు తగ్గించడం కోసం కార్డెన్ సెర్చ్..

విశాలాంధ్ర-హిందూపురం : పట్టణంలోని గుడ్డం కాలని, త్యాగరాజు నగర్ కాలనీలో ఆదివారం తెల్లవారు జామున ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. హిందూపురం డిఎస్పి. మహేష్, పెనుగొండ డిఎస్పి. నర్సింగప్పలతో పాటు ఐదు మంది సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు హెడ్ కానిస్టేబుల్లు, 45 మంది పోలీస్ కానిస్టేబుల్‌తో పాటు హెూం గార్డు, పదిమంది మహిళా పోలీస్ సిబ్బంది, ఐదు మంది స్పెషల్ పార్టీ సిబ్బంది, 120 మంది పోలీస్ సిబ్బంది ఆపరేషన్‌ను నాలుగు విభాగాలుగా విభజించి నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ, కాలనీలో గృహాల వారీగా తనిఖీలు, అనుమా నితులు ప్రాంతం నుంచి తప్పించుకోకుండా నిరోధించడం, ట్రాఫిక్ సైరన్ బైకులతో పహారా బృందాలు, వాహనాలతో తక్షణ చర్య కోసం సిద్ధంగా ఉండడం, ఆపరేషన్ సమయంలో డ్రోన్లు, బాడీ వార్న్ కెమెరాలు, వీడియో కెమెరాలు, ఫింగర్ ప్రింట్ డివైస్‌లు, బెల్ హెల్లర్లు, ట్రాఫిక్ బైకులు వంటి పరికరాలు ఉపయోగించబడ్డాయి. అసాంఘిక శక్తుల పట్ల ఉక్కుపాదం మోపుతామన్నారు.

పరిగి సర్పంచ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన 30 కుటుంబాలు

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం పరిగి మండలం చెందిన పరిగి వైసీపీ సర్పంచ్ లక్ష్మీ దేవమ్మతో పాటు మరో 30 కుటుంబాలు వైసిపి పార్టీ వీడి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు .వారందరికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా మంత్రి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో, నియోజక వర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అందుకే ఆకర్షితులై టీడీపీలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర-ధర్మవరం : నియోజకవర్గ అభివృద్ధి అంటే నాకు వ్యక్తిగత ధ్యేయమని, ప్రతి గ్రామానికి అభివృద్ధి చేరేలా చర్యలు తీసుకుంటానని ధర్మవరం ఎమ్మెల్యే మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ఎన్డీఏ కార్యాలయంలో రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై విస్తృత సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధి పట్ల మన బాధ్యత అత్యంత కీలకమైనది అని, ప్రతి గ్రామం, ప్రతి వార్డు ప్రజలకు అభివృద్ధి ఫలాలు చేరేలా అధికారులు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీ స్థాయిలో జరుగుతున్న రోడ్డు, డ్రైనేజీ, నీటి సరఫరా, హౌసింగ్, విద్యా సంబంధిత పనులపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని, అలస్యానికి చోటు ఇవ్వవద్దని కఠినంగా సూచించారు. ప్రజల సమస్యలను వినడమే కాదు, వాటికి సమాధానం చూపించడం కూడా అధికారుల విధి అని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి అని, ధర్మవరం అభివృద్ధి క్రమంలో ప్రభుత్వం కేటాయించిన నిధులను పారదర్శకంగా వినియోగించాలి అని తెలిపారు. ప్రతి పనికి నాణ్యత ప్రధాన ప్రమాణంగా ఉండాలి అని స్పష్టం చేశారు. ధర్మవరం అభివృద్ధి అంటే నాకో వ్యక్తిగత లక్ష్యం కాదుబీ ఇది మనందరి బాధ్యత అని,ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ధ్యేయమని తెలిపారు. ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం అని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో మహేష్, ధర్మవరం తహసీల్దార్ సురేష్, ముదిగుబ్బ తహసీల్దార్ నారాయణస్వామి, బత్తలపల్లి తహసిల్దార్ స్వర్ణలత, తాడిమర్రి తాసిల్దార్ భాస్కర్ రెడ్డి నియోజకవర్గ అధికారులు, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

కర్నూల్ బస్సు ప్రయాణికులను కాపాడిన ధర్మారం యువకులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-ధర్మవరం: ఇటీవల కర్నూల్ వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ అనుకోకుండా ప్రమాదానికి గురై బస్సు పూర్తిగా కాలిపోయే సమయంలో ధర్మవరానికి చెందిన హరీష్‌కుమార్ రాజు, స్నేహితుడు జానేంద్ర వంశీలను వారి ఇంటికి వెళ్లి ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మీసేవ తపన సమాజానికి ఆదర్శమయిందని, మానవత్వం ముందు భయం జయించిన ధర్మారం యువత అని వారు ప్రసర్శించారు. ప్రయాణికుల ప్రాణాల కోసం ప్రాణాలను పణంగా పెట్టడం నిజంగా అభినందనీయమని తెలిపారు. మీవంటి యువతే దేశముకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పదిమందికిపైగా ప్రయాణికులను ఆ సమయంలో కాపాడటం నిజంగా అభినందించదగ్గ విషయం అన్నారు. అందుకే మీ ధైర్య సాహసాన్ని తాను ప్రశంసిస్తూ సన్మానించడం నా అదృష్టంగా భావిస్తున్నానని వారు తెలిపారు. మీ మానవత్వానికి ధైర్యానికి ప్రతీకగా నేడు దేశంలో నిలిచిందని తెలిపారు.

ఇరువురిని పరామర్శించిన మంత్రి...

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేశగాళ్ల శ్రీనివాసులను, పట్టణములోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ అర్చక్కు కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర్ ప్రసాదును మంత్రి స్వయంగా వారి వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, త్వరగా మీరు కోలుకోవా లని వారికి ధైర్యాన్ని నింపారు. కేశగాళ్ళ శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో కాలుకు తగిలిన గాయమును పరిశీలించి, ధనవంతుగా మీకు అండగా ఉంటానని తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా హర్షంవ్యక్తం చేశారు. తదుపరి చెన్నం శెట్టి జగదీశ్వర్ ప్రసాద్ ఓ ఆపరేషన్ తర్వాత, విశ్రాంతి తీసుకున్న సమయంలో మంత్రి రావడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. చెన్నకేశవ స్వామి ఆలయానికి చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ, ఆధ్యాత్మిక, హిందువుల పండుగలను ఆలయాల్లో విజయవంతంగా చేస్తూ, ప్రతినెల గరుడసేవ కార్యక్రమాన్ని నిర్వహించడం లాంటి కార్యక్రమాలపై మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మీరు ఇరువురు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

గుడిబండ పోలీస్ స్టేషన్లో సిబ్బంది కొరత

విశాలాంధ్ర గుడిబండ : గుడిబండ పోలీస్ స్టేషన్ లో సిబ్బంది కొరత వెంటాడుతున్నది. పోలీస్ స్టేషన్ లో దాదాపు 21 మంది సిబ్బంది ఉండాలి . ప్రస్తుతం ఎస్సై ఇద్దరు ఏఎస్ఐలు ఆరుగురు కానిస్టేబుల్, ఒక్క హెూంగార్డు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గుడిబండ ప్రాంతం పూర్తిగా కర్ణాటక సరిహద్దు లో ఉండడంతో పాటు కర్ణాటక మద్యం అరికట్టడంలో సిబ్బంది కొరత పోలీస్ స్టేషన్‌లోని పోలీస్ అధికారులకు సవాల్‌గా మారింది. పోలీస్‌స్టేషన్ పరిధిలో దాదాపు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాలు దాదాపు 10 నుండి 15 గ్రామాలు పూర్తిగా కర్ణాటక ప్రాంతానికి కేవలం ఒకటి 2 కిలోమీటర్ దూరంలోనే ఉన్నాయి. మరి ముఖ్యంగా గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారి ఆచూకీలు కనిపెట్టడం అత్యవసరంగా వెళ్లవలసిన పరిస్థితిలు ఉంటాయి. పోలీస్ స్టేషన్ కు సంబంధించిన వాహనం లేక అసాంఘిక కార్యకలాపాలు చేసే వ్యక్తులు పోలీసులకు దొరకకుండా తప్పించుకోవడం వంటి అనేక సందర్భాలు ఉన్నాయి. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని గుడిబండ పోలీస్‌స్టేషన్‌కు పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

పరిశుభ్రత ఉన్నప్పుడే మంచి ఆరోగ్యం

విశాలాంధ్ర-ధర్మవరం : పరిశుభ్రత ఉన్నప్పుడే మంచి ఆరోగ్యం లభిస్తుంది అని భారతీయ స్టేట్ బ్యాంక్ రీజినల్ బిజినెస్ కార్యాలయం రీజినల్ మేనేజర్ డి.శశిధర్ కుమార్ తెలిపారు. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 6.0.. స్వచ్ఛతసే స్వచ్ఛతకి ఓట్'అన్న కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వారు పట్టణంలోని పలు కూడలిలో మొత్తం ధర్మవరం పరిధిలోని ఎస్బిఐ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రత నుంచి ఆరోగ్యం వైపు ఎలా ఉండాలి? అన్న అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. శశిధర్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో పరిశుభ్రత పట్ల ప్రజలకు చక్కటి అవగాహన కల్పించినప్పుడే ఆరోగ్యం వైపు అందరూ వెళ్లగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈనెల 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలతో చేపడటం జరుగుతుందన్నారు. మొత్తం సత్యసాయి జిల్లాలో 41 ఎస్బిఐ శాఖల ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వారు స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తి చుట్టుపక్కల గల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యం తప్పక లభిస్తుందని వారు స్పష్టం చేశారు. ప్రజలు కూడా పరిశుభ్రతను తప్పక పాటించి ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు వైవి నాయుడు, రాంప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ దస్తగిరి, ధర్మవరం పరిధిలోని ఎస్‌బీఐ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలందించడంలో సంతృప్తి

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు వైద్య చికిత్సలు అందించడంలో ఎంతో సంతృప్తి సంతోషం లభిస్తుందని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షులు బి.వి రమణ తెలిపారు. ఆదివారం ఆలయ కార్యదర్శి దాసరి వెంకటేశులు (చిట్టి) సూచనల మేరకు పట్టణంలోని తొగట వీధిలో గల శ్రీ శాంత కళా చౌడేశ్వరి దేవి ఆలయ ఆవరణములో 115వ ఉచిత వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. అనంతరం అధ్యక్షులు బివి రమణ మాట్లాడుతూ ఈ వైద్య చికిత్స శిబిరం గత కొన్ని సంవత్సరాలుగా పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహిస్తున్నామని, దాతల సహాయ సహకారాలతో ఇది విజయవంతం కావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. నేటి శిబిర దాతగా శీలం సావిత్రమ్మ, శీలం శ్రీరాములు, వారి కుమారుడు శీలం రమ్యనాగిని, శీలం జయప్రకాష్ కుటుంబ సభ్యులు వ్యవహరించడం పట్ల ఆలయ అభివృద్ధి సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో 312 మంది రోగులకు డాక్టర్ల ద్వారా మంచి వైద్య సికిత్స తో పాటు ఒక నెలకు సరిపడు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దంత వైద్యులు- డాక్టర్ వివేక్ కుళ్ళాయప్ప, డాక్టర్ ఎస్ విట్టల్, చిన్నపిల్లల వైద్య నిపుణులు- డాక్టర్ వెంకటేశ్వర్లు, గ్యాస్ట్రో అండ్ లాప్రోస్ క్లిప్ సర్జన్ హైదరాబాద్ వారి డాక్టర్. జై దీప్ నేత, ఎముకల వైద్య నిపుణులు- డాక్టర్ సతీష్ కుమార్, చెస్ట్ నిపుణులు డాక్టర్. ప్రణయ్ రోగులకు వైద్య చికిత్సలతో పాటు ఆరోగ్య పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిరివెళ్ల రాధాకృష్ణ, బండి నాగరాజు, పెద్దకోట్ల భాస్కర్, డాక్టర్ వినయ్, అశ్వర్థ నారాయణ, విజయ్, మేకల శివయ్య, నారాయణ స్వామి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి

యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఎంతో అవసరమని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్, క్యాంపు చైర్మన్లు పోలా ప్రభాకర్, షేక్ చాంద్బాషా తెలిపారు. ఆదివారం వారు పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిబిరానికి దాతగా కీర్తిశేషులు డాక్టర్ సింగనమల నాగమణి జ్ఞాపకార్థం, యువర్స్ ఫౌండేషన్, కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరంలో 251 మందికి 15 రోజులకు సరిపడు మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బివి. సుబ్బారావు, జనరల్ ఫిజీషియన్ వీరభద్రయ్య, దంత వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్ కుమార్, ఎముకలు కీళ్ల వైద్య నిపుణులు భాను కిరణ్, జనరల్ సర్జన్ డాక్టర్ కొండయ్య, ఆప్తల ఆప్తాలమిక్ అసిస్టెంట్ షేక్ సికిందర్ పాల్గొని రోగులకు వైద్య చికిత్సలతో పాటు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా వివరించడం జరిగిందని తెలిపారు. అవసరమైన వారికి వివిధ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించామని తెలిపారు.యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు కూడా తాము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్సి గుప్తా, గర్రె రమేష్ బాబు, వైకే శ్రీనివాసులు, ఆర్వి. నాగార్జున, సికే రామాంజనేయులు, కౌన్సిలర్, సమాజ సేవకుడు కేతాలోకేష్, ఆర్కే రాధాకృష్ణ, కోటేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

వడ్డేర్ల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-కొత్తచెరువు : వడ్డెర్ల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని.రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, తెలిపారు. ఆదివారం కొత్తచెరువుకి ఆయన విచ్చేయడంతో టిడిపి నాయకులు కార్యకర్తలు వడ్డేర్లు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబన్న స్వతంత్ర పోరాటంలో చేసిన సేవలను ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వడ్డెర్లను గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేసి తనకు ఈ పదవి ఇచ్చారని. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గనులలో 15 శాతం రిజర్వేషన్ వడ్డెర్లకు ఇవ్వాలని ఆదేశాలు కూడా జారీ చేశారన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న, వడ్డెర్లకు ఇళ్ల పట్టాలు ప్రమాద బీమా కాంట్రాక్ట్ పనుల్లో రిజర్వేషన్లను కల్పించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర వడ్డెరి సాధికారిక కమిటీ చైర్మన్ వడ్డే వెంకట్,టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌లో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-అమడగూరు: మహమ్మదాబాద్ గ్రామంలో ఆర్డిటి స్కూల్ ఆవరణంలో ఆదివారం జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతి హిందూ ధర్మ ప్రచార భజన కళాకారుల రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది ఉచిత వైద్య అధికారులు ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడానికి జానపద భజన కళాకారుల రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారన్నారు. చర్మవ్యాధులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, మోకాళ్ళ నొప్పులకు వైద్య సేవలు అందించారు.

యాదవ సంఘం నాయకుడికి నివాళి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మాజీ సర్పంచ్ జయలక్ష్మమ్మ ,సోదరుడు రాంప్రసాద్(65) అనారోగ్యంతో బాధపడుతూ చనిపోగా మృత దేహానికి పూలమాలలు వేసి రాష్ట్ర బీసీ శాఖ మంత్రి సవిత నివాళులు అర్పించారు. రాంప్రసాద్ పెనుకొండ నియోజకవర్గానికి యాదవ సంఘం అధ్యక్షునిగా యాదవుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తారని కొనియాడారు. అనేక మంది ప్రముఖులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించిన వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ దీపిక

విశాలాంధ్ర-హిందూపురం : మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మెడికల్ కాలేజీ లను కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ, ఆదివారం హిందూపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దీపిక ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ, మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేసి పేదలకు విద్య వైద్యం దూరం చేయాలని చూస్తున్నారన్నారు. ఫీజులు చెల్లించుకోలేని పేద విద్యార్థులు వారి ప్రతిభ ఆధారంగా నైపుణ్యంతో వైద్య విద్యను అభ్యసించడానికి ఎంతో ఇష్టంగా ఉన్నారని, మీరు చేసే ఈ ప్రైవేటీకరణ వలన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, కేవలం చంద్రబాబు నాయుడు గారి బినామీలకు ఈ మెడికల్ కాలేజీలను అప్పచెప్పి వారి ద్వారా వైద్య విద్యను వ్యాపారంగా మలుచుకోవాలని, దూరదృష్టితో ముందుకు వెళుతున్నారని మండిపడ్డారు. రాజధాని అంటూ లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారేకానీ, కోట్లాది మంది పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించే ఆధునిక దేవాలయాల కోసం ఈ ప్రభుత్వం 5 వేల కోట్లు ఖర్చు చేయలేదా, ఈ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అనుబంధ విభాగాల నాయకులు, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, టౌన్ ప్రెసిడెంట్, మండల కన్వీనర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కమిటీ సభ్యులు, వివిధ శాఖల మాజీ చైర్మన్‌లు, మాజీ డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ సచివాలయ కన్వీనర్లు, మాజీ గృహ సారథులు, విద్యార్థి మరియు యూత్ విభాగం నాయకులు పాల్గొన్నారు.

కురుగుంట గోవిందుకు గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర-ధర్మవరం: రెవెన్యూ డివిజన్ పరిధిలోని కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన కురుగుంట గోవిందుకు గౌరవ డాక్టరేట్ ఆసియా ఇంటర్నేషనల్ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం ద్వారా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్రం హెూసూరులో ఆయన డాక్టరేట్ పొందారు. గోవిందు అనేక సేవా కార్యక్రమాలు, సామాజిక సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమాచార హక్కు చట్టం లాంటి సేవలు చేయడంలో మంచి గుర్తింపు పొందడం వల్ల విశ్వవిద్యాలయం వారు గుర్తించి ఈ డాక్టరేట్ పట్టాను, షీల్డు, మెడల్‌ను అందజేశారు. అనంతరం కురుగుంట గోవిందు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవ చేస్తారని తెలిపారు.

క్రీడా సామగ్రిని అందజేసిన బీజేపీ జిల్లా కార్యదర్శి డోల రాజారెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత కొన్ని సంవత్సరాలుగా క్రికెట్ క్రీడాకారులు తమకున్న స్తోమత ప్రకారం క్రికెట్ ఆట ఆడుకుంటూ ఉండేవారు. కానీ సరి అయిన, నాణ్యత కలిగిన క్రికెట్ క్రీడా సామాగ్రి లేకపోవడంతో ఎంతో నిరుత్సాహానికి గురయ్యేవారు. దీంతో బిజెపి జిల్లా కార్యదర్శి డోల రాజారెడ్డి తనవంతుగా క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 30 వేల రూపాయలు విలువ చేసే క్రీడా సామగ్రిని క్రికెట్ క్రీడాకారులకు అందజేశారు. అనంతరం డోలా రాజారెడ్డి మాట్లాడుతూ మన ధర్మారం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే కాకుండా క్రీడల పట్ల కూడా ఎంతో శ్రద్ధతో ఉన్నారని, వారి సూచనల మేరకు తనవంతుగా, ఒక క్రీడాకారునిగా ఈ క్రీడా సామగ్రిని ఇవ్వడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. అనంతరం క్రికెట్ క్రీడాకారులు డోలా రాజారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 27, అక్టోబరు 2025

ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం దందా

ఏరులైపారుతున్న కర్ణాటక లిక్కర్!! నిద్రమత్తులో పోలీస్, ఎక్సైజ్ అధికారులు

విశాలాంధ్ర-శెట్టూరు: మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో కర్ణాటక అక్రమ మద్యం ఏరులైపారుతోంది మండలం కర్ణాటక సరిహద్దుల్లో ఉండటం మందు బాబులకు కలిసివచ్చింది. మరోవైపు పలు గ్రామాల్లో కొందరు మద్యం విక్రేతలు కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లను ఇక్కడికి అక్రమంగా తరలించి లక్షల్లోసొమ్ము చేసుకొంటున్నారు. కనీసం ఒక కర్ణాటక మద్యం టెట్రా పాకెట్‌ను 70 రూపాయల నుంచి 100 రూపాయల దాకా అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు. వాటిని తాగేవాడి కుటుంబాలు మాత్రం రోజురోజుకూ అప్పుల ఊబిలో చిక్కుకొని తనువు చాలించేస్థితికి దిగజారుతున్నారు అనటంలో ఎటువంటి సంకోచం లేదు. ఎందుకంటే అనేక కుటుంబాలు నేడు బజారున పడ్డాయి. ఇలా ఉండగా.. కర్ణాటక మద్యంను అరికట్టాల్సిన పోలీస్, ఎక్సైజ్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు పలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. గతంలో ఎక్సైజ్ అధికారులు పల్లెల్లో గస్తీ తిరిగి అక్రమ మద్యంను అరికట్టేవారు.ప్రస్తుతం ఆ పరిస్థితులు ఎక్కడా కనిపంచటం లేదని ప్రతీ గ్రామంలోనూ కనీసం 5 చోట్ల కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మండల కేంద్రంలో ఉన్న స్థానిక పోలీసులు గానీ కంబదూరు ఎక్సైజ్ పరిధిలో ఉన్న అధికారులు కానీ దృష్టి సారించలేదని రాత్రిసమయంలో కర్ణాటక నుండి ఆంధ్ర సరిహద్దులకు మద్యాన్ని దాటిస్తున్నట్లు సంబంధిత అధికారులకు తెలిసినా నిద్రమత్తులో పోలీసులు తూగుతున్నారని మండల ప్రజలు చర్చించు కొంటున్నారు. తనిఖీలు చేసేవారులేక ఇష్టానుసారంగా కర్ణాటక లిక్కర్ ఏరులై పారుతుంది ఎవరైనా అక్రమ దందాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తేఆ సమాచారం వెంటనే అక్రమ మద్యం వ్యాపారులకు చేరిపోతుంది.ఈ సమాచారం అందజేసినందుకు ప్రత్యేక ధరను పోలీసులకు చెల్లించుకోవలసి వస్తుందని వ్యాపారులు పలువు రితో చర్చించినట్లు సమాచారం. దీంతో ఈ మొత్తం అక్రమ వ్యాపారంపైతమకు గిట్టుబాటు అవుతుండటం తోకర్ణాటక మద్యంఅక్రమ రవాణా విక్రయాలకుపోలీసులు అడ్డుకట్ట వేయలేకపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రవాణా దారులకు మంచి ఆదాయం.. కర్ణాటక నుంచి ఒక్కో మద్యంటెట్రా పాకెట్ నుమండలంలోని గ్రామాలకు చేర్చితే రూ.70 నుంచి రూ.80ల చొప్పున యువకులకు విక్రయదారులు అందజేస్తున్నారు. ఈ మొత్తాన్ని మద్యం ప్రియులపై రుద్దిఅధిక ధరకు విక్రయిస్తున్నారు. రూ35 ఎంఆర్‌పీ ధర ఉన్న ఒక్క టెట్రా పాకెట్ ను రూ.200చొప్పున తాగుబోతులకు కట్టబెడుతున్నారు. దీనితో ఒక్క పాకెట్‌పై ఎంత లేదన్న రూ.100 నుంచి రూ.130 ఆదాయం గడిస్తున్నట్లు సమాచారం రోజు10 ప్యాకెట్లు మద్యం అమ్ముకొంటే కనీసం రూ.1,300 వరకు మిగులుబాటు ఉంటుంది. ఈ మొత్తం తంతు కేవలం గంటలోపే మద్యం అక్రమ విక్రయదారులు ముగిం చేస్తున్నారు. దీంతో నెలకు రూ.50 వేల నుండి రూ. లక్ష వరకు ఆర్జిస్తున్నట్లు పలువురు చర్చించు కొంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ చూసినా కర్ణాటక టెట్రా ప్యాకెట్లు దర్శనమి స్తున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఈ కర్ణాటక మద్యంను కట్టడి చేస్తారా లేదా అన్నదే ప్రశ్నార్థకం.

మనగుడి మంగళ కౌశిక ద్వాదశి పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి

విశాలాంధ్ర-గోరంట్ల: తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నవంబర్ రెండవ తేదీన గోరంట్ల మండలంలోని వానవోలు వెంకటేశ్వర స్వామి సన్నిధానంలో నిర్వహించే మన గుడి మంగళ కౌశిక ద్వాదశి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న సందర్భంగా విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత పోస్టర్లను విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ హాజరై మనగుడి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో తెలుగు పూజారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శివరాం ఆంజనేయులతో పాటు జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజన్నప్ప, మల్లెల జయరాం దేవళ్ల మురళి, వడ్డెర సాధికారత రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, మహేంద్ర, సహకార సంఘం చైర్మన్ రవిమోహన్, మండలాధ్యక్షులు కడప రామంజీ తదితరులు పాల్గొన్నారు.

పలు శుభకార్యాలకు హాజరైన మంత్రి

విశాలాంధ్ర-పెనుకొండ: రొద్దం మండలం రాగిమేకల పల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ కుమార్తె నిఖాకి పెనుకొండ పట్టణంలోని వన్సిక ఫంక్షన్ హాల్‌లో హాజరై నూతన వధూవరులను రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆశీర్వదించారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర-తాడిపత్రి: రక్తదానం చేయడంతోనే ప్రాణదాతలు అవుతారని పెంగ్విన్ మాంటిసోరి పాఠశాల ప్రిన్సిపల్ జిలాన్ భాష పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సంజీవ నగర్ జీరో రోడ్లో గల పెంగ్విన్ మాంటిస్సోరి పాఠశాల, ట్యూషన్లో పాఠశాల ప్రిన్సిపల్ జిలాన్ భాష ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2004-07 సైన్స్ స్టూడెంట్స్ బ్యాచ్ సహకారంతో రక్తదాన శిబిరం, నేత్రదాన ప్రతిజ్ఞ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 30 మంది రక్తదాతలు, 30 మంది నేత్రదాన దాతలు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన రక్తదాతలకు సర్టిఫికెట్, లక్ష రూపాయలు ప్రమాద బీమా సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిర నిర్వాహకులు నాగ రంగయ్య, మహేంద్ర, ప్రతాప్ రెడ్డి, పెంగ్విన్ మాంటిస్సోరి స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ .హరి, రెడ్ క్రాస్ బృందం పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించండి

విశాలాంధ్ర-గుడిబండ : గుడిబండ మండలంలోని దీన్నేహట్టి గ్రామం నుండి కొంకల్లు క్రాస్ వరకు రోడ్డు ఇరువైపులా కంపచెట్లు పెరిగి ప్రయాణీకులకు తీవ్రమైన నష్టం మిగిలిస్తుంది. వివరాల్లోకి వెళితే దీన్నేహట్టి, కొంకల్లు, గుడ్డదహళ్ళి, జీఎస్ తాండ, వయ జంబలబండ మడకశిర కు వెళ్ళే దారిలో నిత్యం మందలపల్లి పి.సి.గిరి, సీసీ గిరి, మల్లినమడుగు, హెచ్ హెచ్.టి. అలాగే రొల్ల ఆగలి, మండలాలకు కర్ణాటక ప్రాంతంలోని శిర పట్టణాలకు నిత్యం అనేకమంది ప్రయాణికులు ద్విచక్ర వాహనంలో వెళుతూ ఉంటారు. ఈ రోడ్డు మార్గంలో వెళ్లేవారు ఇప్పటికే చాలామంది ప్రమాదాలకు గురి అయ్యి ఆస్పత్రుల పాలై తీవ్ర నష్టపోయామని.ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించి గుంతల మయమైన రోడ్డుకు మట్టి వేసి గుంతలను పూడ్చి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని ఈ సందర్భంగా కోరారు.

అవినీతి రహిత పాలనను ఆమ్ ఆద్మీ పార్టీ అందిస్తుంది..

పార్టీ జిల్లా అధ్యక్షులు అసుదుల్లా

విశాలాంధ్ర-ధర్మవరం: అవినీతి రహిత పాలనను ఆమ్ ఆద్మీ పార్టీ అందజేస్తుందని ఆమ్ ఆత్మీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆసదుల్లా, జిల్లా కార్యదర్శి అల్లా ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ధర్మవరం లో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలతో పాటు అవినీతి రహిత పాలన అందిస్తామని తెలిపారు. పార్టీ వ్యవస్థాపకులు కేజ్రీ వాల్ చేసిన పరిపాలనను వారు గుర్తు చేశారు. ఢిల్లీలో రెండుసార్లు పరిపాలన సాగించడం జరిగిందన్నారు. ప్రస్తుతం పంజాబ్ రాష్ట్రంలో కూడా మా పార్టీ పరిపాలన చేస్తుందన్నారు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఆమ్ ఆద్మి పార్టీని విస్తరింప చేసే పనిలో ఉన్నామని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో కూడా మా పార్టీ అభ్యర్థులను నిలుపుతామని తెలిపారు. ఇందులో భాగంగానే ధర్మవరం నియోజకవర్గ నూతన కోఆర్డినేటర్ గా హరికృష్ణ కుమ్మరను ఏకగ్రీవంగా ఎంపిక చేసామని, అదేవిధంగా జిల్లాలో ప్రాంతములవారీగా ఇన్చార్జిలను కూడా నియమించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన రాజకీయ ప్రముఖులు..

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని చందన గ్రామానికి చెందిన పెయ్యాల రంగారెడ్డి, జనార్దన్ రెడ్డి, వివాహ మహోత్సవానికి ప్రత్యేక ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా ఆదివారం వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై నూతన వధూవరులు లక్ష్మీ రమణిక ,కాశిరెడ్డి లను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జాయింట్ సెక్రెటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డి, మండల వైసీపీ సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు వైసిపి మండల కన్వీనర్ సంజీవ రాయుడు బోగతి బ్రహ్మానందరెడ్డి కుందనకోట వెంకటరామిరెడ్డి చందన శివ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: రోడ్డు ప్రమాద బాధితుడికి రూ.35 వేలు ఆర్థిక సాయం అందించి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ అండగా నిలిచిరు. ఈమేరకు ఆయన్ను ఆదివారం పలువురు అభినందిం చారు. కల్యాణదుర్గం మండలం చాపిరి గ్రామానికి చెందిన రమేష్ కు మూడు రోజుల క్రితం బైక్ ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసంప్రస్తుతం బెంగళూరు లోని సెయింట్ జాన్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్నీ చాపిరి గ్రామస్తులు ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు ప్రమాద బాధితుడు రమేష్ దినసరి కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారని, ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న రమేష్ ప్రమాదానికి గురి కావడంతో బాధిత కుటుంబ పరిస్థితి చాలా ఇబ్బంది కరంగా మారిందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ. 35000 (వేలు) చెక్‌ను అందించారు. ఆపదలో ఆపన్న హస్తం అందించడం తో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తిప్పేస్వామి,లక్ష్మన్న,చిరంజీవి, చాపిరి గ్రామస్థులు హెచ్.శ్రీరాములు, మూర్తి, నీలకంఠ, ఎర్రిస్వామి, కొల్లప్ప, హనుమంతు, నాగరాజు, రామాంజినేయులు, గంగన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడులు

14 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర-తాడిపత్రి: 14 మంది పేకాట రాయులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.ధరణి బాబు పేర్కొన్నారు. ఆదివారము రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఎస్ఐ కె.ధరణి బాబు మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు మండలంలోని ఊరిచింతల గ్రామం, కొండపై ఉన్న పెద్దమ్మ గుడి దగ్గరలో గ్యాంబ్లింగ్ గురించి రాబడిన సమాచారం మేరకు తాడిపత్రి సబ్ డివిజినల్ పోలీస్ ఆఫీసర్, రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ ఆదేశాలు మేరకు తాడిపత్రి రూరల్ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ కె.ధరణి బాబు సిబ్బంది పేకాట ఆడుతున్న ప్రాంతానికి వెళ్లి చుట్టు ముట్టి 14 మందిని అదుపులోనికి తీసుకొని, వారి వద్ద నుంచి 1,66,150/-, 52పేక ముక్కలు, 9 సెల్ ఫోన్లు, 4 కార్లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఏడుగురు అరెస్టు

విశాలాంధ్ర, శెట్టూరు : మండలంలోని లక్ష్మంపల్లి గ్రామ పొలాలలో పేకాట ఆడుతున్నారని శెట్టూరు పోలీస్ స్టేషన్ ఎస్సై రాంభూపాల్ రాబడి సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి రైడ్ చేసి పేకాట ఆడుతున్న ఏడు మంది వ్యక్తులను రూ.9800, నాలుగు మోటర్ సైకిల్‌లను, వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై నరసింహారెడ్డి, కానిస్టేబులు నరసింహులు, సురేష్ పాల్గొన్నారు.

27న మండల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర-గుత్తి : పట్టణంలోని ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో ఈనెల 27,28 తేదీలలో రెండు రోజులపాటు మండల స్థాయి స్కూల్ గేమ్స్ జరుగ నున్నాయని శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ కె.ఎచ్. సరోజ, పుష్పరాజు, శ్యామల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 అండర్ 17 బాల బాలికలకు స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు వివరించారు. 27న వాలీబాలు,కోకో,కబడ్డీ ఆటలు, అదే రోజున చెస్, యోగా, షటిల్ పోటీలు, 28వ తేదీన అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా 100 మీటర్లు,200 మీటర్లు,400 మీటర్లు షాట్ పుట్, డిస్కస్, జావలిన్ లాంగ్ రేస్ పరుగు పందెం పోటీలు జరుగుతాయని చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా జితేంద్ర గౌడ్ జన్మదిన వేడుకలు..

విశాలాంధ్ర-గుంతకల్లు : స్థానిక మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ జన్మదిన వేడుకలు కార్యకర్తలు, అభి మానుల మధ్య ఘనంగా జరిగాయి. టీడీపీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, ఈడిగ కుల సంఘం సభ్యులు, రామగౌని అభిమానులు మధ్య కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆటోతో ద్విచక్ర వాహనం ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు..

విశాలాంధ్ర-యాడికి : మండలంలోని చందన గ్రామానికి చెందిన రమేష్ తన భార్యతో కలిసి యాడికి వెళ్లి తన ద్విచక్ర వాహనంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా రైల్వే గేట్ నుండి వస్తున్న ఆటో ఢీకొనడంతో రమేష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి ఆయన భార్య చేతికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 ద్వారా గుత్తికి తరలించారు.

ప్రభుత్వం తక్షణమే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

వాల్మీకి హక్కుల పోరాట సమితి నాయకులు

విశాలాంధ్ర-ఉరవకొండ: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి హక్కుల పోరాట సమితి నాయకులు న్యాయవాది చంద్ర చర్ల హరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వాల్మీకి కళ్యాణమండపంలో బహుజన యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వాల్మీకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత 60 సంవత్సరాలుగా వాల్మీకులను ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో పునరుద్ధరిస్తామని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఎన్నికలు అయిపోగానే మరిచిపోతున్నారని ఆరోపించారు. కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ వాల్మీకులను ఓటు బ్యాంకు రాజకీయంగా పార్టీలు వాడుకుంటున్నాయని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వాల్మీకులు అందరు కూడా ఐక్యంగా ఎస్టీ జాబితాలో చేర్చాలని ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలలో కూడా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. భారత దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా వాల్మీకులు ఎస్సీలుగానో, ఎస్టీలుగానో ఉన్నారన్నారు. ఒక్క మన తెలుగు రాష్ట్రాలలో మాత్రం రాజకీయ కుట్రలకు బలిపశువులుగా మారి ఏజెన్సీ, మైదాన ప్రాంతమంటూ విడదీసి వాల్మీకులను బీసీలుగా చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం సమంజసం కాదన్నారు. సమాజంలో అన్నిరకాలుగా వెనుకబడిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వాల్మీకి నాయకులు సుశీలమ్మ, డి సురేష్, ముండాస్ ఓబులేసు, నారాయణప్ప, సురేంద్ర, హనుమప్ప, దిద్దేకుంట రామాంజనేయులు శ్రీరాములు, చుక్క రాజు, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సరుకులు పంపిణీ

విశాలాంధ్ర- తాడిపత్రి: పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉన్న శివక్రిష్ణ సాయి వృద్ధా ఆశ్రమంలో నందలపాడుకు చెందిన గంధమ్మ అనే నిరుపేద కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెలకు సరిపోయే నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.సంజీవరెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ సెక్రటరీలు నారాయణస్వామి, లక్ష్మి అనురాధ, నాగవాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి హక్కుల పోరాట సమితి నాయకులు న్యాయవాది చంద్ర చర్ల హరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వాల్మీకి కళ్యాణమండపంలో బహుజన యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. వాల్మీకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా వాల్మీకులను ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో పునరుద్ధరిస్తామని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఎన్నికలు అయిపోగానే మరిచిపోతున్నారని ఆరోపించారు. కేంద్రం రాష్ట్రంలోనూ వాల్మీకులను ఓటు బ్యాంకు రాజకీయంగా పార్టీలు వాడుకుంటున్నా యని మండిపడ్డారు. జిల్లాలో 14 నియోజకవర్గాలలో కూడా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు సుశీలమ్మ, డి సురేష్, ముండాస్ ఓబులేసు, నారాయణప్ప, సురేంద్ర, హనుమప్ప, దిద్దేకుంట రామాంజనేయులు శ్రీరాములు పాల్గొన్నారు.

ఘనంగా దేవమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవమ్మ దేవి ఆలయంలో సోమ మంగళ వారాల్లో దేవమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన, కలస ప్రతిష్టాపన నిర్వహిస్తున్నట్లు ఆలయ పెద్దలు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం గణపతిపూజ, గణపతి హెూమం, నవగ్రహ హెూమం, దుర్గా హెూమం, మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం హెూమాలు, మంగళవారం ఉదయం గంగపూజ, గోపుర కలస ప్రతిష్టాపన, దేవమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన, మహా మంగళహారతి, హుండిబియ్యం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి భక్తాదులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలం హెూసగుడ్డం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకుని వారి వద్ద నుండి రూ.14,500ల నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. సిబ్బంది నాగరాజు, మల్లికార్జున, రామాంజనేయులు, కృష్ణారెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానానికి వ్యతిరేకంగా నేడు ర్యాలీ..

విశాలాంధ్ర-గుంతకల్లు : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణ ఆపాలని వైసీపీ స్టూడెంట్ లీడర్ రాష్ట్ర నాయకులు వంశీ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైసీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు నక్కా నారప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం వైయస్ఆర్ఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశి యాదవ్, ఏవీఎస్ జిల్లా అధ్యక్షులు వాల్మీకి వంశీ ఎస్ఎస్‌యువై నియోజవర్గ అధ్యక్షులు అక్షయ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిపిపి విధానం ద్వారా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను 66సంవత్సరాల వరకు ప్రైవేటు వారికీ కట్టాబెడుతూ పేద మధ్య తరగతి వారికీ ప్రభుత్వ విద్య అందకుండా అన్యాయం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రైవేటుపరం కాకుండా చేసే ఉద్యమానికి మద్దతుగా నిలవాలన్నారు. నేడు ర్యాలీ ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం దిగి వచ్చేవరకు విద్యార్థి ఉద్యమాలు బలంగా చేయాలని పిలుపు నిచ్చారు. 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్ మండల ఉపాధ్యక్షుడు గణేష్ నాయకులు అజయ్ మధు ఎస్ఎస్‌యుఐ నాయకులు రవి, స్రవంత్ పాల్గొన్నారు.

పెన్నోబిలం రిజర్వాయర్ నుండి నీటి విడుదల

విశాలాంధ్ర-కూడేరు: పెన్నోబిలం రిజర్వాయర్ నుండి ఆదివారం 5,6వ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలినట్లు డిప్యూటీ ఎద్యుకేటివ్ ఇంజనీర్ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్ పూర్తి సమర్థం 11.1000 టీఎంసీలు ఉన్నట్లు. లింకు ఛానల్ ద్వారా 150 క్యూసెక్కులు, హంద్రీనీవా ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 550 క్యూసెక్కులు నీరు చేరుతుండగా, కుడి కాల్వ ద్వారా 35 క్యూసెక్కులు, వృధా నీరు 25 క్యూసెక్కులు, విద్యుత్కు 105 క్యూసెక్కులు, త్రాగునీరు ద్వారా మొత్తం 55, క్యూసెక్కులు,స్పీల్ వే కింద 200 క్యూసెక్కులు, మొత్తం కలిపి 420 క్యూసెక్కులు బయటికి వెళ్తుండగా, ఆదివారం 4, 6 గేట్లు ఎత్తి 420 క్యూసెక్కుల నీటిని బయటికి వదిలినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ ముత్యాలప్ప, గంగమ్మ రేణుక తదితరులు పాల్గొన్నారు, లక్ష్మీదేవి, రేణుక పాల్గొన్నారు.

తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ, కలెక్టర్, ఆర్డిఓ అధికారుల ఆదేశాల మేరకు రాబోవు మంథా తుఫాను కారణంగా రాబోవు నాలుగు రోజులలో భారీ ఈదురు గాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉన్నందు వలన ధర్మవరం మండల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మార్వో సురేష్ బాబు తెలిపారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులు సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి, ప్రజలకు తెలియజేయాల్సిన విషయాలను తెలియజేశారు. మట్టి మిద్దె ఇండ్లలో ఎవరు నివాసం చేయరాదు అని, వర్ష పరిస్థితి తగ్గే వరకు దగ్గరలో వున్న ప్రభుత్వ భవనాలలో ఉండాలని తెలిపారు. ఈదురు గాలులకు చెట్లు పడి పోవడం, కరెంటు తీగలు జారిపోవడం జరుగుతుంది కావున చెట్ల క్రింద, కరెంటు స్థంబాల కింద ఉండరాదన్నారు. గర్భిణీలను ఆశవర్కర్, సంబంధిత ఏఎన్ఎం వారికి తెలియజేయాలన్నారు.